సాక్షి నిజామాబాద్

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



వెంటాడుతున్న అకాల వర్షం

వరి రైతులను అకాల వర్షం వెంటాడుతోంది. బాల్కొండ మండల పరిధిలో ఆదివారం తెల్లవారు జామున వర్షం కురిసింది.

- 8లో ▸



రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వేరువేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
43.0 /30.4

వాతావరణం

ఉదయంనుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష



నిజామాబాద్‌అర్బన్: బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీలో ప్రవేశం కోసం జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఇంటర్‌లో 2,694 మంది విద్యార్థులకు గాను 2,355 మంది పరీక్ష రాయగా.. 339 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీలో 936 మంది విద్యార్థులకు గాను 814 మంది హాజరు కాగా, 122 మంది పరీక్ష రాయలేదు.

ఎన్‌సీసీ బెస్ట్ కెడెట్‌గా ఎంపిక



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఈదుల సాత్విక ఎన్‌సీసీ ఉత్తమ కెడెట్‌గా ఎంపికైంది. జూనియర్ వింగ్ విభాగంలో నిజామాబాద్ గ్రూపు నుంచి ఆల్ రౌండ్ బెస్ట్ కెడెట్ 2 గా ఎంపికైందని పాఠశాల ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఎన్‌సీసీ ప్రతిభా పరీక్షలో ఫైరింగ్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, రాత పరీక్షలలో ఉత్తమ ప్రతిభ చూపి ఈ ఘనత సాధించిందన్నారు. ఆదివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో సాత్వికను అభినందించారు.

మాదిగల సంక్షేమమే ముఖ్యం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



పిట్లం: మాదిగ జాతి భవిష్యత్తు కోసమే పోరాటం చేస్తున్నానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఆదివారం పిట్లంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో దళిత సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంద కృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పిట్లంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించన సమావేశంలో మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ తాను బీజేపీ నాయకుడిని కాదన్నారు. బీజేపీ మద్దతుదారుడి మాత్రమేనన్నారు. పదవులు ముఖ్యం కాదని, దళిత బిడ్డల జీవితాలు మార్చడమే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు. అందుకే ఎన్ని అవకాశాలు వచ్చినా తాను ఏ పార్టీ కండువా కప్పుకోలేదన్నారు. మాదిగ బిడ్డల సంక్షేమం కోసం మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని, తన పోరాటానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ మద్దతు పలికారని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి దళిత రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు పలికి మూడు నెలల్లోనే ఆ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. అందుకే తాను బీజేపీకి మద్దతు తెలుపుతున్నానన్నారు. దళితులను కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు మోసం చేశాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తనను మరోమారు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మాజీ ఎమ్మెల్యే గంగారాం తదితరులు పాల్గొన్నారు.

2019లో పసుపు బోర్డు కోసం ఆర్మూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు(ఫైల్)



రాత మార్చిన రైతుపోరు

- 2019 ఎంపీ ఎన్నికల బరిలో 176 మంది కర్షకులు
- పసుపు బోర్డు డిమాండ్‌తో పోటీ
- రైతులకు పోలైన ఓట్లు 98వేలు
- బీజేపీకి కలిసొచ్చిన ఓట్ల చీలిక
- 'నిజామాబాద్'లో తొలిసారి కమలం జయకేతనం

ఆర్మూర్ : ఆర్మూర్ కేంద్రంగా పసుపు, ఎర్రజొన్న రైతులు 2019 ఫిబ్రవరిలో చేపట్టిన ఉద్యమం నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రాన్నే మార్చింది. రైతుపోరుతో నియోజకవర్గంలో తొలిసారి బీజేపీ జయకేతనం ఎగురవేసింది. బీజేపీ విజయం సాధించడంలో ఆర్మూర్ ప్రాంత రైతాంగం కీలకభూమిక పోషించారు. పసుపు బోర్డు డిమాండ్‌తో 176 మంది రైతులు బరిలో దిగి 98వేలకు పైగా ఓట్లు సాధించారు. ఈ ఓట్ల చీలిక నాడు బీజేపీ గెలుపులో కీలకంగా మారింది. 2019 నిజామాబాద్ ఎన్నిక దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. నాడు రైతులు సాధించిన ఈ ఓట్లు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటములను తారుమారు చేసింది.

బీజేపీ విజయంలో రైతుల కీలకపాత్ర

2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అర్వింద్ విజయంలో రైతుల పాత్ర కీలకమైంది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 14,96,593 మంది ఓటర్లు ఉండగా బీజేపీ అభ్యర్థి అర్వింద్‌కు 4,80,584 ఓట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల కవితకు 4,09,709 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్‌కు 69,240 ఓట్లు వచ్చాయి. విజయం సాధించిన అర్వింద్‌కు 70,875 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో ఉన్న 176 మంది రైతులకు 98వేలకు పైగా ఓట్లు వచ్చాయి. నాటి ఎన్నికల్లో రైతులు పోటీలో లేనిపక్షంలో రైతులు సాధించిన ఓట్లు వివిధ పార్టీలకు మళ్లడం ద్వారా అభ్యర్థుల విజయాలు సైతం తారుమారయ్యే అవకాశం ఉండేది. నాడు పసుపుబోర్డు డిమాండ్ బలంగా రావడంతో.. ఎన్నికల సమయంలో ధర్మపురి అర్వింద్ తాను గెలిస్తే వారం రోజుల్లో పసుపు బోర్డు సాధిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి రైతులను తమవైపునకు తిప్పుకున్నారు. అయితే ఆలస్యమైనా కూడా గత శాసన సభ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీతో పసుపు బోర్డు ప్రకటన చేయించారు. ఇలా ఆర్మూర్ కేంద్రంగా ఎగసిన రైతుల ఉద్యమం వల్ల 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ విజయం సాధించడంతో పాటు దేశ దృష్టి నిజామాబాద్‌వైపు మళ్లింది.

మద్దతు ధరతో పాటు బోర్డు ఏర్పాటు కోసం..

పసుపు, ఎర్రజొన్న పంటలకు గిట్టుబాటు ధరతో పాటు పసుపు బోర్డు ఏర్పాటు డిమాండ్లతో నిజామాబాద్, జగిత్యాల జిల్లాల పరిధిలోని రైతులు 2019లో పోరుబాట పట్టారు. 20 రోజుల పాటు పెద్దఎత్తున ఉద్యమించారు. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో.. రైతులు అసెంబ్లీకి పాదయాత్ర చేపట్టగా.. పోలీసులు అడ్డుకొని ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారు. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎంపీ కవిత సైతం రైతుల ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేశారు. దీంతో తమ గలాన్ని వినిపించేందుకు నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన రైతులు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా నామినేషన్లు వేసి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత ఎంపీగా ఉన్న నిజామాబాద్ స్థానంలో పెద్దఎత్తున నామినేషన్లు వేస్తే.. సమస్య తీవ్రత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వెళ్లి శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావించారు. మొత్తం 245 మంది రైతులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు, స్క్రూటినీ, ఉప సంహరణల పర్వం ముగిసే సమయానికి 185 మంది అభ్యర్థులు బరిలో ఉండగా అందులో 176 మంది రైతులే కావడం విశేషం.

దసరా వరకు పసుపు బోర్డు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్ : దసరా పండుగ నాటికి నిజామాబాద్ జిల్లా కేంద్రంగా పసుపు బోర్డు ఏర్పాటు చేసి తీరుతామని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మల్లారం శివారులో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 15 వరకు రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. బీజేపీ పాలనలో ఎరువులు, విత్తనాల ధరలు రెట్టింపు అయ్యాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు కట్టుబడి ఉందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకానికి రూ.లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200లోపు యూనిట్లు వాడిన వారికి ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. బీడీ కార్మికులందరికీ పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విమర్శించారు. బీజేపీ నాయకులు రాముడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఎంపీగా జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, ఎల్లయ్య, బాగిర్తి బాగారెడ్డి, మేక బాగారెడ్డి, అగ్గు భోజన్న, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కాంగ్రెస్, బీజేపీవి అబద్ధపు హామీలు

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



ప్రజలకు నమస్కరిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

వేల్పూర్ : కాంగ్రెస్, బీజేపీ నాయకుల అబద్ధపు హామీలు నమ్మి మోసపోవద్దని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో ఆదివారం ఆయన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాయమాటలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. మోసగించే వాగ్దానాలతో వస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులను నిలదీయాలన్నారు. గ్రామస్తులు బాజిరెడ్డి, ప్రశాంత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. నాగలి, గొంగడి, గొర్రెపిల్ల బహూకరించారు.

వేగంగా కొనుగోళ్లు

- ఇప్పటివరకు 3.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- రాష్ట్రంలోనే మొదటి స్థానంలో జిల్లా
- రూ. 348.33 కోట్లు రైతుల ఖాతాల్లో జమ



సుభాష్‌నగర్: జిల్లాలో ధాన్యం సేకరణ వేగంగా కొనసాగుతోంది. నెల రోజుల్లోనే 426 కేంద్రాల ద్వారా 3.05 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశారు. మొదట్లో కొంత నెమ్మదిగా సాగినా.. ఆ తర్వాత కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పలుమార్లు అకాల వర్షాలు కొనుగోళ్లకు అడ్డంకిగా మారాయి. అయినప్పటికీ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో పౌరసరఫరాల శాఖ, సహకార శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లలో వేగం పెంచారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో నల్గొండ, సూర్యాపేట్, కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి. ఇప్పటివరకు రూ. 348.33 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు.

సకాలంలో రైతుల ఖాతాల్లోకి డబ్బులు..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 648 కోట్ల విలువైన ధాన్యం సేకరించారు. ఇప్పటికే 21,678 మంది రైతులకు రూ. 348.33 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. రైతులు ధాన్యానికి సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించిన వారం రోజుల్లోనే డబ్బులు జమ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. అక్కడక్కడా సమస్యలు తలెత్తినా.. వారి దృష్టికి వచ్చిన వెంటనే అధికారులు పరిష్కారం చూపుతున్నారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, గన్నీ బ్యాగుల కొరత లేకుండా, టార్పాలిన్లు, ఇతర ఎలాంటి సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేశారు.

అగ్రస్థానంలో జిల్లా

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపడుతున్నారు. నెల రోజుల్లోనే 3.05 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో నల్గొండలో 2,47,759 మెట్రిక్ టన్నులు, సూర్యాపేట్‌లో 1,35,479, కామారెడ్డిలో 1,18,394, యాదాద్రి భువనగిరిలో 93,954 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

426 కేంద్రాల్లో..

జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణ కోసం 426 కేంద్రాలు ప్రారంభించారు. అందులో 46 ఐకేపీ, 374 సొసైటీ, డీసీఎంఎస్, మెప్మా 6 కేంద్రాలు ఉన్నాయి. సుమారు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 45,154 మంది రైతుల నుంచి 3,05,170 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. 26,113 మెట్రిక్ టన్నులు ఐకేపీ ద్వారా, 2,76,048 మెట్రిక్ టన్నులు సొసైటీ, డీసీఎంఎస్, 3009 మెట్రిక్ టన్నులు మెప్మా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేశారు. ఇప్పటికే 2,99,833 మెట్రిక్ టన్నుల ధాన్యం రైస్‌మిల్లులకు తరలించారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం

జిల్లాలో సుమారు 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా. అందులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 6 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే 3 లక్షలకు మించి కొనుగోలు చేశాం. మరో 15 నుంచి 20 రోజుల్లో నిర్దేశించిన మేరకు లక్ష్యం చేరుకుంటాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశాం. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తున్నాం. సకాలంలో రైతులకు డబ్బులు జమ చేస్తున్నాం.

– జగదీష్ కుమార్,
జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

నేటి నుంచి ఓటు హక్కుపై ఫొటో ఎగ్జిబిషన్

ఖలీల్‌వాడి: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై సోమవారం నుంచి మే 1వ తేదీ వరకు ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మానాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ బస్టాండ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసే ప్రదర్శనను ఉదయం 10:30 గంటలకు ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలిస్ వజ్ ఆర్, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎస్.కిరణ్ కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం జానీ రెడ్డి, స్వీప్ జిల్లా నోడల్ అధికారి సురేశ్‌కుమార్, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొంటారన్నారు.

గల్ఫ్ కార్మికులతో కాంగ్రెస్ రాజకీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

- ఎన్నికలప్పుడే వారు గుర్తొస్తారా?
- ఐపీఎఫ్‌తో వలస కార్మికులకు అండగా నిలుస్తున్నాం
- ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్: పొట్టకూటి కోసం కుటుంబాలను వదిలి గల్ఫ్‌దేశాల్లో పనిచేస్తున్న కార్మికులతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని, ఆ పార్టీకి ఎన్నికల సమయంలోనే వారు గుర్తుకొస్తారని బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. ఆదివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో గల్ఫ్ కార్మికుల ఓట్లను దండుకునేందుకు గల్ఫ్ బోర్డు అంటూ డ్రామాలు ఆడు తుందని ఆరోపించారు. జీవన్ రెడ్డి 45 ఏళ్ల రాజ కీయ జీవితంలో ఏనాడూ గల్ఫ్‌కార్మికులను పట్టించుకోలేదన్నారు. గల్ఫ్ దేశాల్లో బీజేపీకి అనుబంధంగా ఇండియన్ పీపుల్స్ ఫోరం ద్వారా అనేక వైద్య, న్యాయ సేవలు అందిస్తున్నామని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏడాది దోపిడీ ఆపేస్తే రూ. 40వేల కోట్లు జమ చేయవచ్చని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారని, అంటే ఆరు నెలల్లో రూ. 20వేల కోట్లు సంపాదించినట్లా అని ప్రశ్నించారు.

ప్రజలకు సేవ చేయడానికే ఐపీఎఫ్

ప్రపంచ దేశాల్లో ప్రజలకు సేవలందించడానికే ఇండియన్ పీపుల్స్ ఫోరం ఏర్పాటు చేశామని ఫోరం యూఏఈ అధ్యక్షుడు జితేందర్ వైద్య పేర్కొన్నారు. దేశంలోని వివిధ వర్గాల ప్రజలు ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లి అక్కడ ఎదుర్కొంటున్న కష్టాలను ఫోరం పరిష్కరిస్తుందన్నారు. ఎంపీ అరివ్యంద్ సేవా గుణం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలపై గట్టి నిఘా

- ఏడు బృందాలతో ప్రత్యేక తనిఖీలు



ఖలీల్‌వాడి: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఎన్నికల సంఘం ఆదేశాలను అమలు చేయడానికి ఏడు తనిఖీ బృందాలను నియమించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులను ఈ బృందాలలో సభ్యులుగా చేసి తనిఖీలకు రంగంలోకి దింపారు. జిల్లా సరిహద్దు ప్రాంతంలోని తనిఖీ కేంద్రాల వద్ద 24 గంటల పాటు తనిఖీలు చేపడుతున్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ)

ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రచారం చేసేటప్పుడు ఎన్నికల నియామవళి అమలుపై వచ్చే ఫిర్యాదులపై తనిఖీలు చేస్తారు. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను గంటన్నరలో పరిష్కరించేందుకు ఈ బృందం బాధ్యతలు తీసుకుంటుంది. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి, నేషనల్ గ్రీవెన్స్ సెల్‌కు అందిన పొలిటికల్ పార్టీలకు నుంచి అందిన ఫిర్యాదులను పరిష్కరిస్తుంది. ఎన్నికల కోడ్ అమలుకు పర్యవేక్షిస్తాయి. పొలిటికల్ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు నగదు, బంగారం, మద్యం, గిఫ్ట్‌లు, వివిధ రకాల వస్తువులను ఇచ్చేందుకు ముందుకు వస్తారు. వీటిపై దృష్టి సారించి వాటిని అడ్డుకుంటారు. ఈ బృందంలో ఒక అధికారితోపాటు హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుల్స్, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. 17 బృందాలు ఉన్నాయి.

వీడియో సర్వేలెన్స్ బృందాలు (వీఎస్‌టీ)

వీడియో సర్వేలెన్స్ టీంలు సభలు, సమావేశాల్లో రాజకీయ నాయకులు, అభ్యర్థుల ప్రసంగాలు, ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలపై వీడియో చిత్రీకరిస్తారు. ఇందులో ఏపీఎం, ఒక సహాయకుడు, ఒక వీడియోగ్రాఫర్‌లు ఉంటారు. వీరు మూడు షిఫ్టుల్లో పని విధులు నిర్వహిస్తారు. ఈ టీం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రోజువారీ వివరాలను అందిస్తుంటారు. నియోజవకర్గానికి ఒక బృందం ఉంటుంది.

వీడియో వ్యూయింగ్ బృందం(వీవీటీ)

వీడియో వ్యూయింగ్ బృందంలో నాయబ్ తహసీల్దార్(డీటీ), ఇద్దరు సహాయకులు ఉంటారు. వీరు స్టాటిస్టిక్ సర్వైలెన్స్(ఎస్ఎస్‌టీ) బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్(ఎఫ్ఎస్‌టీ) బృందాలు, వీడియోగ్రాఫర్స్ చిత్రీకరించిన వీడియోలను పరిశీలించి కోడ్ ఉల్లంఘనులపై ఎన్నికల అధికారులకు నివేదిస్తారు. రెండు బృందాలు ఉంటాయి.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) టీంలు

మండల స్థాయిలో ఎంపీడీవోలు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కార్యాయం, మున్సిపల్ కార్పొరేషన్లలోని మున్సిపల్ కమిషనర్ ఎన్నికల నియామవళిని పరిశీలిస్తారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వీరు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచారం కోసం ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, చిత్రాలను తొలగిస్తారు. నేతల విగ్రహాలను దుస్తులతో కప్పివేస్తారు. గోడలపై వివిధ పార్టీలు రాసిన వాటిని పేయింట్‌తో తొలగిస్తారు. అలాగే పార్టీలకు చెందిన జెండాలను తొలగిస్తారు. ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తారు.

అకౌంటింగ్ బృందాలు

నియోజకవర్గానికో అకౌంటింగ్ బృందాలను ఎన్నికల సంఘం కేటాయించింది. ఎన్నికల్లో వివిధ పార్టీలు చేసే ఖర్చులను పత్యేకంగా కసరత్తు చేస్తుంది. ఎస్‌టీవోకు చెందిన సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో ఈ టీం తనిఖీలు ముమ్మరం చేస్తుంది. రెండు బృందాలు ఆరుగురు సభ్యులు ఉంటారు.

ఖర్చుల పరిశీలన

ఖర్చుల పరిశీలనకు ఎన్నికల సంఘం బృందం ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి సంబంధించినవి, ఇతర ఖర్చులు చేసిన వాటిని ఖర్చుల టీం పరిశీలించి వివరాలను తెలుసుకుంటారు. ఈ బృందంలో ఒక అధికారి, ఒకరు సహాయకులు, ఇద్దరు ఎంపీఎస్వోలు ఉంటారు. నియోజకర్గంలో ఒక బృందం పర్యవేక్షిస్తుంది.

స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ (ఎస్ఎస్‌టీ)

నామినేషన్లు ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ బృందాల తనిఖీ మొదలవుతుంది. ఇందులో ముగ్గురు సభ్యులు ఉంటారు. రెండు బృందాలు రెండు బృందాలు 24 గంటల పాటు పనిచేస్తారు. పార్టీలు సభలు, సమావేశాలకు నిర్వహించే ఖర్చులను సమాచార అందితే రహస్యంగా వీడియోలు చిత్రీకరిస్తారు. సరిహద్దు, సమస్యాత్మక ప్రాంతాల్లో మకాం వేసి కోడ్ అమలును పర్యవేక్షిస్తారు. అన్ని పార్టీలతో పాటు ఇతర వాహనాలను తనిఖీలు చేస్తారు. నాలుగు బృందాలుండగా ఇందులో ఆరుగురు సభ్యుల చొప్పున ఉంటారు.

క్లుప్తంగా

ఎంఐఎం మద్దతు కోరిన బాజిరెడ్డి

ఖలీల్‌వాడి: ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాతో కలిసి ఎంఐఎం నాయకులను ఆదివారం కలిశారు. జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్డులో ఉన్న ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షకీల్ ఇంటికి వెళ్లారు. గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలిపిన విధంగానే ఈ ఎన్నికల్లో సైతం మద్దతు తెలుపాలని కోరారు. అయితే, తమ పార్టీ అధినేత ఆదేశాల మేరకు పనిచేస్తామని ఎంఐఎం నాయకులు, ఆ పార్టీ కార్పొరేటర్లు స్పష్టం చేసినట్లు తెలిసింది.

జాతీయ అబాకస్‌లో సాయిసంస్కృతి ప్రతిభ



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని న్యూ ఆదర్శ్ స్కూల్‌కి చెందిన వడ్డెవార్ సాయి సంస్కృతి అబాకస్‌లో జాతీయస్థాయి పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం జాతీయ స్థాయి అబాకస్ పోటీని హైదరాబాద్‌లో నిర్వహించగా పాఠశాలకు చెందిన సాయి సంస్కృతి ప్రతిభ చూపి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయుడు నాందేవ్, విఠల్, రమ్య, గ్రామస్తులు అభినందించారు.

బస్వాపూర్‌వాసికి డాక్టరేట్



భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన సముద్రాల రాజేంద్రప్రసాద్ రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. గీతం విశ్వవిద్యాలయం ఆయనకు పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, గ్రామస్తులు రాజేంద్ర ప్రసాద్‌ను అభినందించారు.

యోగా సర్టిఫికెట్ కోర్సు శిబిరం

కామారెడ్డి అర్బన్ : ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కామారెడ్డి లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో మేనెల 5వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించే యోగా సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఫౌండేషన్ అధ్యక్షుడు నివాస్ పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. 8333855845లో సంప్రదించాలని నివాస్ పటేల్ కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత

మాచారెడ్డి : ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితునికి ఆదివారం మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సెల్ ఫోన్ అందజేశారు. మండల కేంద్రానికి చెందిన రాహుల్ ఫోన్ పోయిందని ఫిర్యాదు ఇవ్వగా సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



రుద్రూర్: మండల కేంద్రంలోని చౌరస్తాలో ఆదివారం సాయంత్రం ఎస్సై అప్పారావ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు, ప్రయాణికులు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు.

అర చేతిలో ఎన్నికల సమాచారం



ఖలీల్‌వాడి/ఎల్లారెడ్డి: టెక్నాలజీ ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉన్న ఈ రోజుల్లో ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఓటరు చేతిలో ఉంచేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటోంది. ఓటు హక్కు నమోదు, ఓటరు కార్డు డౌన్‌లోడ్ చేసుకోవడంతోపాటు బరిలో నిలిచిన అభ్యర్థి గురించి తెలుసుకోవాలన్నా.. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదు చేయాలన్నా ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎప్పటికప్పుడు పోలింగ్‌శాతం తెలుసుకోవడం మారుమూల ప్రాంతాల ఓటర్లకు సైతం కష్టం కాకుండా టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిన యాప్‌లతో సమాచారం తెలుసుకోవడం సులభమైంది.

అభ్యర్థుల వివరాల కోసం కేవైసీ యాప్



ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలు తెలుసుకునేందుకు కేవైసీ యాప్ ఉపయోగపడుతుంది. అభ్యర్థుల వివరాలను 'నో యువర్ క్యాండిడేట్ (కేవైసీ)' యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అభ్యర్థులకు సంబంధించిన ఎడ్యుకేషన్ వివరాలు, వారి నేర చరిత్ర, అఫిడవిట్‌కు సంబంధించి పూర్తి వివరాలు యాప్‌లో ఉంటాయి. అవసరమైె అభ్యర్థుల అఫిడవిట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పోలింగ్ సరళి కోసం 'ఓటర్ టర్న్ అవుట్'



పోలింగ్ ప్రక్రియ పూర్తి కాగానే నియోజకవర్గాల వారీగా నమోదైన పోలింగ్ శాతం తెలుసుకునేందుకు ఎన్నికల సంఘం ఓటర్ టర్న్ అవుట్ యాప్‌ను సిద్ధం చేసింది. పోలింగ్ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. జిల్లా, నియోజకవర్గాల వారీగా వివరాలు తెలుసుకోవచ్చు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

వృద్ధులు, వికలాంగులకు 'సాక్ష్యం' యాప్



వృద్ధులు, వికలాంగులు సాక్ష్యం యాప్‌లో వివరాలు నమోదు చేస్తే వారిని అధికారులు పోలింగ్ కేంద్రాలకు తీసుకువస్తారు. కేంద్రంవ రకు రవాణా సౌకర్యం కల్పించడంతోపాటు పోలింగ్ కేంద్రంలో వారికి ప్రత్యేకంగా వీల్‌చైర్‌ను ఏర్పాటు చేస్తారు. ఓటు వేసిన తరువాత వారిని ఇంటి వద్ద వదిలిపెడతారు. కదలలేని స్థితిలో ఉన్నవారు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పిస్తారు.

ఓటరు నమోదుకు 'హెల్ప్‌లైన్'



'హెల్ప్‌లైన్' యాప్ ద్వారా ఓటరుగా పేరు నమోదు చేసుకోవడంతోపాటు గుర్తింపు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే ఫిర్యాదులు, అభ్యర్థులకు సంబంధించిన వివ రాలు, జాతీయపార్టీల వివరాలు, ఎన్నికల షెడ్యూల్, పోలింగ్ తేదీ లు, ఎన్నికల సంఘం ఉత్తర్వులు, ప్రకటనలకు సంబంధించిన వివరాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఎక్కువ సమాచారం పొందవచ్చు.

'సీ-విజిల్'తో అక్రమాలకు అడ్డుకట్ట



ఎన్నికల సమయంలో అభ్యర్థులు కోడ్ ఉల్లంఘించినా లేదా ఎవైనా అక్రమాలు దృష్టికి వచ్చినా ఎవరైనా సరే 'సీ-విజిల్' యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయొచ్చు. కోడ్ ఉల్లంఘన, అక్రమాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలు, ఆడియో క్లిప్పింగ్‌లతో సహా ఈ యాప్‌లో ఫిర్యాదు చేస్తే అధికారులు 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇందుకు గాను టోల్‌ఫ్రీ నంబర్ 1950ను ఏర్పాటు చేశారు.

చిక్కని ఓటరు నాడి

- ఎండ తీవ్రత కారణంగా ప్రచారంలో కనిపించని జనం
- 'ఫలితం'పై ఎవరి అంచనాలు వారివే..



ఖలీల్‌వాడి: లోక్‌సభ ఎన్నికల తేదీ గడువు సమీపిస్తున్నప్పటికీ ఓటరు నాడి అంతుచిక్కక అభ్యర్థులకు చెమటలు పడుతున్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో త్రిముఖ పోటీ నెలకొంది. 14 రోజుల సమయమే ఉండడంతో రాజకీయపార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే, ఎండ తీవ్రత కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతుండడంతో ప్రచారం బోసిపోతోంది. జిల్లాలో ఎండవేడికి ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావడం లేదు. రెండుమూడు రోజులుగా జిల్లాలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ఉదయం పూట ఇంటింటి ప్రచారం చేస్తూనే గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్న చోట్లకు వెళ్లి అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ఎండకు జనం లేకపోవడంతో కార్యక్రమాలను ప్రధాన పార్టీలు వాయిదా వేసుకుంటున్నాయి. దీంతో ఓటర్లు ఎటు వైపు మొగ్గుచూపుతారోనని అభ్యర్థులు, నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

మూడు పార్టీలకూ ప్రతిష్టాత్మకమే..

నిజామాబాద్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య పోటీ నెలకొంది. బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు విజయం సాధించి, ఐదేళ్ల చొప్పున పదేళ్లపాటు పదవిలో కొనసాగగా, 10 ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ ఎలాగైనా విజయం సాధించాలనే తహతహలాడుతోంది. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల్లో విజయం సాధించి తన ఉనికిని పదిలం చేసుకోవాలనుకుంటోంది. రెండోసారి బీజేపీ విజయం సాధించేందుకు ఉత్సాహంగా ముందుకుసాగుతోంది. పలుచోట్ల బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీని వీడుతున్నప్పటికీ ఆ పార్టీ అగ్రనాయకత్వం గెలుపు ధీమాతో ప్రచారంలో దూసుకెళ్తోంది. దీంతో ఈ ఎన్నికల బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది.

చిన్న పార్టీలతో ఓట్ల చీలిక

ప్రధాన పార్టీలతోపాటు చిన్నచిన్న పార్టీలో బరిలో నిలిచాయి. ఈ పార్టీల కారణంగా ఓట్లు చీలుతాయనే చర్చ సర్వత్రాసాగుతోంది. 2019 ఎన్నికల్లో పసుపు రైతులు 176 మంది బరిలో నిలువడంతో బీఆర్‌ఎస్ ఓట్లు చీలి బీజేపీకి విజయం సాధ్యమైంది. ప్రస్తుత ఎన్నికల్లో స్వతంత్రులు పోటీలో నిలవడం ఎవరిపై ప్రభావం చూపుతుందోనని రాజకీయ విశ్లేషకులు చర్చిస్తున్నారు.

21వ ప్యాకేజీ పూర్తి చేసి సాగునీరందిస్తాం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి
- మోపాల్, బోర్గాం(పి)లో కార్నర్ మీటింగ్

మోపాల్/ఇందల్వాయి: పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రాణహిత-చేవెళ్ల 21వ ప్యాకేజీకి నిధులు కేటాయించి ఆయకట్టు రైతాంగానికి సాగునీరందిస్తామని, పదేళ్ల ఈ పనులు పూర్తికాకపోవడానికి మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కారణమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరశివారులోని బోర్గాం(పి)లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. సాయంత్రం మోపాల్‌లో కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఇందల్వాయి మండలంలో ప్రచారం చేశారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, జగిత్యాల్ కౌన్సిలర్ అల్లే జయశ్రీ రఘు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్‌కు ఔటర్ రింగ్‌రోడ్డు, స్మార్ట్‌సిటీగా గుర్తింపు తీసుకొస్తానని తెలిపారు. అంతకుముందు బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పట్టించుకోని నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. జీవన్‌రెడ్డి మరో అన్నా హజారే అని, అన్నివర్గాలకు అండగా నిలిచే వ్యక్తి అని పేర్కొన్నారు. బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లు తొలగించి ఎస్సీ, ఎస్టీ, బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు. జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని, వివిధ పార్టీల నాయకులు ఆయనకు మద్దతు తెలుపుతున్నారని తెలిపారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బీన్ హందాన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నాయకులు కాట్‌పల్లి నగేష్‌రెడ్డి, ఈగ గంగారెడ్డి, సందగిరి భూమారెడ్డి, బాడ్సి శేఖర్ గౌడ్, ముప్ప గంగారెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఎల్లొల్ల సాయిరెడ్డి, కెతావత్ యాదగిరి, పసుల శ్రీనివాస్, బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోపాల్‌లో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి



కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో..

జ్ఞాపకాల సమ్మేళనం

కమ్మర్‌పల్లి/సిరికొండ: పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు చిన్ననాటి జ్ఞాపకాలకు వేదికలయ్యాయి. సుమారు రెండు దశాబ్దాల తరువాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(2003 - 04), సిరికొండ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో(2006-07) ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.



సిరికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

డ్యూటీకి వెళ్తూ హెడ్‌కానిస్టేబుల్..



అంత్యక్రియల్లో పాల్గొన్న ఏఎస్పీ, పోలీస్ అధికారులు



శ్రీనివాస్ గౌడ్ (ఫైల్)

తాడ్వాయి(ఎలారెడ్డి): ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘటనలో తాడ్వాయి పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్(50) మృతి చెందినట్లు ఏఎస్సై సంజీవులు తెలిపారు. శనివారం రాత్రి చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. డ్యూటీకి హాజరయ్యేందుకు శనివారం అర్ధరాత్రి శ్రీనివాస్‌గౌడ్ తన కారులో కామారెడ్డి నుంచి తాడ్వాయికి బయల్దేరాడు. తాడ్వాయి శివారులోకి రాగానే కెనాల్‌వద్ద ప్రధాన రహదారిపై లారీని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలపాలైన శ్రీనివాస్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య జ్యోతి, ఒక కుమారుడు ఉన్నారు. లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా పార్కింగ్ చేయడం కారణంగానే ప్రమాదం జరిగిందని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఏఎస్పీ

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాస్‌గౌడ్ అంత్యక్రియలను ఆదివారం పట్టణంలో నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డితోపాటు పలువురు పోలీస్ అధికారులు అంత్యక్రియలకు హాజరయ్యారు. శ్రీనివాస్‌గౌడ్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐలు సంతోష్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, గాంధారి, తాడ్వాయి ఎస్సైలు, సిబ్బంది అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని..



ధర్మపురి సూర్యకిరణ్ (ఫైల్)

నందిపేట్(ఆర్మూర్): రోడ్డుపై ఉన్న ధాన్యం కుప్పను ఢీకొని నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన ధర్మపురి సూర్యకిరణ్(32) మృతి చెందాడు. నందిపేట మండలం సీహెచ్ కొండూర్ గ్రామ సమీపంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తన అత్తగారి ఊరైన తల్వేదకు సూర్యకిరణ్ ఆదివారం వచ్చాడు. సాయంత్రం బైక్‌పై లోకేశ్వరానికి తిరిగి వెళ్తుండగా కొండూర్ సమీపంలో ధాన్యం కుప్పను ఢీకొట్టాడు. సూర్యకిరణ్ తలకు బలమైన గాయాలుకావడంతో అటుగా వెళ్తున్న వారు లోకేశ్వరం గ్రామస్తులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న లోకేశ్వరం గ్రామస్తులు గాయాలపాలైన సూర్యకిరణ్‌ను చికిత్స నిమిత్తం భైంసాకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

అడవి పందులను తప్పించబోయి..

ఇందల్వాయి: అడవి పందులను తప్పించబోయి కారు అదుపు తప్పిన ఘటనలో మహిళ మృతి చెందింది. చంద్రాయన్‌పల్లి శివారులో ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్‌లోని గండిమైసమ్మ ప్రాంతానికి చెందిన మట్టా సురేశ్‌రెడ్డి తన భార్య నీతిరెడ్డితో కలిసి నిర్మల్ జిల్లాలోని అడెల్లి పోచమ్మ ఆలయానికి కారులో బయల్దేరాడు. కారు చంద్రాయన్‌పల్లి అటవీ ప్రాంతానికి చేరుకోగానే అడవిపందులు అడ్డు వచ్చాయి. పందులను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో నీతిరెడ్డి(40) తలకు తీవ్రగాయాలమై ఘటనాస్థలంలోనే మృతి చెందింది.

వెంటాడుతున్న అకాలవర్షం



ధాన్యం కుప్పలపై కప్పిన టాటిపత్రులు

వరి రైతులను అకాల వర్షం వెంటాడుతోంది. ఉమ్మడి బాల్కొండ మండలం పరిధిలో ఆదివారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. గత పదిహేను రోజులుగా రైతుల కంటి మీద కునుకు ఉండడం లేదు. సకాలంలో కాంటాలు పూర్తికాకపోవడంతో ధాన్యం కుప్పలు కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయాయి. అకాలవర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు. – బాల్కొండ



తడిసిన ధాన్యం

రైలు కిందపడి వృద్ధురాలి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరు సమీపంలోని రామేశ్వర్‌పల్లి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. రైలు పట్టాలపై మృతదేహం ఉందనే సమాచారం మేరకు కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్, సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతురాలిని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన శామర్తి బాలమణి(65)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, బాలమణి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని ఎస్సై తెలిపారు.

బావిలో కుళ్లిన మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో వంతెన వద్ద ఉన్న ఓ బావిలో కుళ్లిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని ఆదివారం గుర్తించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు మహిళను గోనెసంచులు, ప్లాస్టిక్ సంచిలో కట్టి బావిలో పడేశారని తెలిపారు. హోలీ నాటి నుంచి మండల కేంద్రానికి చెందిన చాకలి బుర్తి కీర్తన అదృశ్యమైనట్లు సమాచారం ఉందని, మృతదేహం ఆమెదే కావొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చిత్తుబొత్తు స్థావరంపై దాడి

రాజంపేట: తలమడ్ల గ్రామం శివారులో కొందరు చిత్తుబొత్తు ఆడుతున్నారనే సమాచారం మేరకు శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థావరంపై దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ.6060 నగదు, ఆరు సెల్‌ఫోన్లను సీజ్ చేసి రాజంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు అందించాలని టాస్క్‌ఫోర్స్ అధికారులు కోరారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

ధర్పల్లిలో దొంగల హల్‌చల్



వివరాలను సేకరిస్తున్న ఎస్సై విక్రమ్

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో శనివారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఉక్కపోత కారణంగా సుంకరి నవీన్‌తోపాటు కుటుంబ సభ్యులు శనివారం రాత్రి తన ఇంటి తలుపులను తెరిచి నిద్రపోయారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న నవీన్ తల్లి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు, రెండు సెల్ ఫోన్లు , కొంత నగదును ఎత్తుకెళ్లారు. మెలకువ వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులు ఇంట్లో చూసేసరికి సామగ్రి, దుస్తులు చిందరవదరగా పడేసి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై విక్రమ్ పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి

నిజామాబాద్ నాగారం: వైద్యం వికటించి గర్భిణీ మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు గర్భిణీ మృతదేహంతో ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నాలుగు నెలల గర్భిణీ అయిన నిజామాబాద్ నగరం పరిధిలోని కాలూర్‌కు చెందిన కంఠం స్రవంతి (35) చికిత్స కోసం ఖలీల్‌వాడిలోని కీర్తిసాయి ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన డాక్టర్ గర్భంలో శిశువు పరిస్థితి బాగా లేదని హార్ట్‌బీట్, శ్వాసకు సంబంధించిన సమస్య ఉందని, వెంటనే అబార్షన్ చేయనిపక్షంలో ప్రమాదమన్నారు. అబార్షన్ అయ్యేలా మందులు ఇవ్వడంతో స్రవంతిని కుటుంబసభ్యులు ఇంటికి తీసుకెళ్లారు. ఇంటి వద్ద మందులు వేసుకున్న స్రవంతికి తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు డాక్టర్‌కు ఫోన్ చేసి విషయం తెలుపగా, ఆందోళన చెందొద్దని, ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. శనివారం ఉదయం స్రవంతిని ఆస్పత్రికి తీసుకురాగా, పరిస్థితి విషమించిందని మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని సదరు డాక్టర్ సూచించారు. దీంతో చేసేదేమీ లేక స్రవంతిని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే స్రవంతి మృతి చెందిందని, న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని కీర్తిసాయి ఆస్పత్రి ఎదుట శనివారం రాత్రి కుటుంబ సభ్యులు మృతదేహంతో బైఠాయించారు. దీంతో ప్రైవేట్ డాక్టర్ తన తప్పును ఒప్పుకొని రూ.10 లక్షల నష్టపరిహారం అందించినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని రోజూ ఏదో ఒక సంఘటన ప్రైవేట్ ఆస్పత్రుల్లో చోటుచేసుకుంటున్నా వైద్యారోగ్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక నిండు ప్రాణం ఖరీదు రూ.10లక్షలేనా? అని ప్రశ్నిస్తున్నారు.